విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
జిల్లా బ్యూరో చీఫ్‌లు | జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు
నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు | మండల రిపోర్టర్‌లు
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :
8328649322, 9398236146.

తొవ్వ
సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

## ఈటల.. దిగజారుడు రాజకీయం తగదు : ఎమ్మెల్యే వాకిటి

హైదరాబాద్, మే 15: పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌కు దిగజారుడు రాజకీయం తగదని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముదిరాజ్ హితవు చెప్పారు. గురువారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 'రాజకీయాల్లో పలుచన కాకూడదంటే బూతులు మాట్లాడకూడదు. బాధ్యతగా వ్యవహరించాలి. రాత్రికి రాత్రే ఏదో అయిపోవాలనుకునే వారికి ఆ భాష ఉపయోగపడుతుందేమో కానీ ఈటల రాజేందర్‌కు కాదు. సీఎం రేవంత్‌ను ఉద్దేశించి కొడకా అన్న పదం ఆయన ఉపయోగిస్తారనుకోలేదు. ఇలాంటి భాష, దిగజారుడు రాజకీయం ఈటలకు సరికాదు' అని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఈటల నుంచే హుందాతనం, ఒదిగి ఉండే లక్షణం తాము నేర్చుకున్నామని, కానీ ఆయనపైనే తాము మాట్లాడాల్సి వస్తుందనుకోలేదన్నారు. ఈటలపై వ్యక్తిగత విమర్శలు చేయడానికి తన మనస్సాక్షి ఒప్పుకోవట్లేదన్న శ్రీహరి.. సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను ఆయన ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సంపుటి : 1 | సంచిక : 284 | శుక్రవారం 16-05-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 2 | వెల : 5 రూ/.

## కర్ణాటక తరహా లైసెన్స్‌డ్ సర్వేయర్లు

### తొలిదశలో 5 వేల మంది నియామకం: పొంగులేటి

హైదరాబాద్, మే 15: రాష్ట్రంలో భూ లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా గ్రామ స్థాయిలో లైసెన్స్ సర్వేయర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కర్ణాటకలో విజయవంతమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానాన్ని తెలంగాణలోనూ అమలు చేయడానికి కార్యచరణ రూపొందిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిదశలో 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నామని, ఇందుకోసం ఈ నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులకు సర్వే అకాడమీలో 50 రోజుల పాటు



శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కర్ణాటకలో అమలవుతున్న లైసెన్స్‌డ్ సర్వేయర్ విధానంపై ఇటీవల సర్వే విభాగానికి సంబంధించిన ఇద్దరు ఉన్నతాధికారులు అధ్యయనం చేసి నివేదిక ఇచ్చారని పేర్కొన్నారు.

# కాళేశ్వరానికి మాస్టర్ ప్లాన్

## ఆలయ అభివృద్ధికి రూ.200 కోట్లు.. గోదావరి పుష్కరాల్లో శాశ్వత పనులు

### సరస్వతీ పుష్కరాల్లో సీఎం రేవంత్
### పుష్కర స్నానమాచరించి ముక్తీశ్వరుడికి పూజలు
### వైభవంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం



**భూపాలపల్లి, మే 15 :** దక్షిణ కాశీగా పేరొందిన కాళేశ్వరం అభివృద్ధికి ఎంత ఖర్చయినా నిధులు మంజూరు చేస్తామని, వెంటనే మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణీ సంగమం వద్ద గురువారం ప్రారంభమైన సరస్వతీ నదీ పుష్కరాలకు సీఎం హాజరయ్యారు. పుష్కర స్నానమాచరించి, ముక్తీశ్వరస్వామికి అభిషేకం చేయడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ కాళేశ్వరం అభివృద్ధికి వెంటనే మాస్టర్ ప్లాన్ తయారుచేసి ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కాళేశ్వరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడం కోసం మంత్రి శ్రీధర్‌బాబు రూ.100 కోట్లు అడిగారని, రూ.200 కోట్లు అయినా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని, ఇక్కడ గోదావరి పుష్కరాల పనుల్లో భాగంగా ఆలయానికి సంబంధించి శాశ్వత అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. గోదావరి నది ఈ ప్రాంతానికి ఆశీర్వాదం లాంటిదన్నారు. పుష్కరాల్లో స్నానం చేయడం అంటే చేసిన తప్పులు కడుక్కోవడమేనని, తప్పులు చేసినా, చేయకున్నా పుష్కర స్నానం చేసి మంచి తపనతో ముందుకు వెళ్లాలన్నారు. ఒకప్పుడు దేశ ఆర్థిక గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించిన పీవీ నరసింహారావులాగే ప్రస్తుతం తెలంగాణ అభివృద్ధి కోసం పెట్టుబడులు తేవడంలో తనకు చేదోడు వాదోడుగా ఉంటున్న మంత్రి శ్రీధర్‌బాబు ఈ ప్రాంతం వ్యక్తి కావడం అదృష్టమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ అభివృద్ధికి రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తేవడంలో శ్రీధర్‌బాబు తనకు చేదోడు వాదోడుగా ఉన్నారని చెప్పారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు కూడా మాట్లాడారు. గురువారం సాయంత్రం 4.14 గంటలకు హెలికాప్టర్‌లో కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... నేరుగా ప్రధాన ఘాట్‌కు చేరుకుని 15 అడుగుల సరస్వతీ మాత ఏకశిలా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొత్తగా నిర్మించిన జ్ఞాన సరస్వతీ ఘాట్‌ను ప్రారంభించారు. వీఐపీ ఘాట్‌కు సరస్వతీ ఘాట్‌గా నామకరణం చేశారు. అనంతరం పుష్కర స్నానమాచరించి, సరస్వతీ మాతకు ప్రభుత్వం తరఫున చీర, సారెను సమర్పించారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో మహాదేవుని దర్శించుకుని, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. సరస్వతి నదీ ఒడ్డుకు చేరుకుని మహానదీహారతిలో పాల్గొన్నారు.

**సరస్వతీ పుష్కరాలకు వచ్చిన తొలి సీఎం రేవంత్**

సరస్వతీ నది పుష్కర చరిత్రలో సీఎం పాల్గొనడం ఇదే తొలిసారి. 2013లో ఈ పుష్కరాల కోసం నాటి ప్రభుత్వం కేవలం రూ.14 లక్షలే కేటాయించింది. ప్రస్తుత పుష్కరాల కోసం సీఎం రేవంత్ 37 కోట్లు కేటాయించటంతో పాటు సరస్వతీమాత ఏకశిలా విగ్రహం, పుస్తక ఆకృతి విగ్రహాన్ని గోదావరి నది ఒడ్డున ఏర్పాటు చేశారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని పుష్కర ఘాట్‌లను భారీ హంగులతో నిర్మించారు.

## వారాంతంలో చెట్లు నరకడంలో ఆంతర్యమేంటి?

### ముందస్తు ప్రణాళికతోనే చేసినట్లు ఉంది
### కంచ గచ్చిబౌలి భూముల కేసులో మరోసారి సుప్రీంకోర్టు ఆగ్రహం




న్యూఢిల్లీ, మే 15: "వీకెండ్ చూసి (వారాంతంలో) చెట్లు నరకడంలో ఆంతర్యమేంటి? డజను బుల్డోజర్లతో 1000 చెట్లను నరికేశారు. దీనిని ముందస్తు ప్రణాళికతోనే చేసినట్లు ప్రాథమికంగా కనిపిస్తోంది. అక్కడ చెట్ల నరికివేతకు పర్యావరణ అనుమతులు తీసుకున్నారా? లేదా? అధికారుల చర్యలను సమర్థించాలని చూడొద్దు" అంటూ కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో తెలంగాణ ప్రభుత్వంపై సర్వోన్నత న్యాయస్థానం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. హైదరాబాద్ యూనివర్సిటీ పరిసరాల్లో అడవిని పునరుద్ధరిస్తారో లేదో చెప్పాలని నిలదీసింది. లేకపోతే, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సహా బాధ్యులైన అధికారులందరూ అక్కడే తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళతారని పునరుద్ఘాటించింది. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిలో రాష్ట్ర ప్రభుత్వం చెట్లు కొట్టేసిన అంశాన్ని ఏప్రిల్ 3న సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే. దీనిని భారత ప్రధాన న్యాయమూర్తి, జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలో జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహలతో కూడిన ధర్మాసనం గురువారం మరోసారి విచారించింది. తొలుత.. తెలంగాణ ప్రభుత్వం తరఫున అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. సుప్రీంకోర్టు గత ఆదేశాలను అనుసరించి కంచె గచ్చిబౌలిలో పనులన్నీ ఆపేశామని, వైల్డ్ లైఫ్ సంరక్షణ చర్యలు కొనసాగిస్తున్నామని చెప్పారు. సీఈసీ నివేదిక బుధవారం రాత్రే తమకు అందిందని, దానికి బదులిచ్చేందుకు సమయం కావాలని విజ్ఞప్తి చేశారు.

## పకృతి విధ్వంసానికి సీఎందే బాధ్యత: కేటీఆర్



హైదరాబాద్, మే 15: కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో ప్రకృతి విధ్వంసం, రూ.10 వేల కోట్ల అవినీతికి సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై గురువారం విచారణ సందర్భంగా అధికారులపై సుప్రీంకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. రేవంత్ రెడ్డి మూర?త్వంతో అధికారులు జైలుశిక్ష అనుభవించే పరిస్థితి నెలకొందన్నారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రేవంత్‌రెడ్డి తప్పులను ఒప్పుకుని, అక్కడ బుల్డోజర్లతో ధ్వంసం చేసిన అడవులను పునరుద్ధరించాలని, లేదంటే ఆయనకూ కోర్టు శిక్షలు తప్పవన్నారు.

## ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు జైషే ఉగ్రవాదుల హతం



శ్రీనగర్/ ట్రాల్, మే 15: జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నిషేధిత జైషే మహ్మద్ సంస్థకు చెందిన ముగ్గురు కరుడుగట్టిన ఉగ్రవాదులు హతమయ్యారని పోలీసులు తెలిపారు. పుల్వామా జిల్లా అవంతిపొరాలోని ట్రాల్ పట్టణానికి సమీపంలోని నాదిర్ గ్రామంలో ఉగ్రవాదులున్నారని నిఘా వర్గాలకు ఉప్పందింది. దీంతో ఉగ్రవాదులు దాక్కున్న ఆ గ్రామాన్ని భద్రతాదళాలు చుట్టుముట్టి గాలింపు చేపట్టాయి. నిర్మాణంలో ఉన్న ఓ భవనంలో దాక్కున్న ఉగ్రవాదులు భద్రతాబలగాలను చూసిన ఉగ్రవాదులు కాల్పులకు దిగినట్లు డ్రోన్ చిత్రీకరించిన వీడియోలో కనిపిస్తోంది. దీంతో భద్రతాదళాలు ఆత్మరక్షణార్థం జరిపిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు మరణించారు. వారిని జైషే మహ్మద్ సంస్థ ఉగ్రవాదులు అసిఫ్ అహ్మద్ షేక్, అమీర్ నజీర్ వనీ, యవార్ అహ్మద్ భట్‌గా గుర్తించిన భద్రతా దళాలు.. ఆ ముగ్గురూ పుల్వామా జిల్లా వాసులేనని తెలిపాయి.

## 19న రాష్ట్ర క్యాబినెట్ సమావేశం?



**హైదరాబాద్, మే 15:** రాష్ట్ర క్యాబినెట్ సమావేశం ఈ నెల 19న జరిగే అవకాశం ఉంది. జూన్ 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవంపై ఈ భేటీలో చర్చించనున్నారని సమాచారం. నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద ఎంత మంది అర్హులవుతారు, ఎంతమేర నిధులు అవసరమవుతాయన్న వివరాలపై క్యాబినెట్ సమావేశంలో చర్చించే అవకాశాలున్నాయి. కంచ గచ్చిబౌలి భూముల విషయంపై కూడా మంత్రిమండలి చర్చించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు విధించడమా?

### రాజ్యాంగంలోనే అటువంటి నిబంధన లేనప్పుడు తీర్పు ఎలా ఇస్తారు?.. అది ఎలా చెల్లుబాటు?
### 200, 201 అధికరణాల కింద గవర్నర్, రాష్ట్రపతికి బిల్లుల ఆమోదం విషయంలో అధికారాలుంటాయి
### కాలపరిమితిపై రాజ్యాంగం గడువు విధించలేదు
### అలాంటప్పుడు సుప్రీంకోర్టు ఎలా విధిస్తుంది?
### 14 ప్రశ్నలు సంధించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
### ఆర్టికల్ 143(1) కింద సుప్రీంకోర్టును వివరణ కోరిన రాష్ట్రపతి





న్యూఢిల్లీ, మే 15: రాష్ట్రాల బిల్లులు ఆమోదించే విషయంలో గవర్నర్, రాష్ట్రపతికి గడువు విధిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రశ్నించారు. శాసనసభలు ఆమోదించిన బిల్లులకు గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై సుప్రీంకోర్టు గత నెల 8న సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇలాంటి అంశాలపై 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలంటూ గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. ఈ తీర్పును రాష్ట్రపతి ప్రశ్నించారు. రాజ్యాంగంలో అలాంటి నిబంధనేదీ లేనప్పుడు.. సుప్రీంకోర్టు తీర్పు ఎలా ఇచ్చిందని? అది ఎలా చెల్లుబాటు అవుతుందని ముర్ము అడిగారు. రాజ్యాంగంలోని 143(1) అధికరణం ప్రకారం తనకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించుకొన్న రాష్ట్రపతి ముర్ము.. ఈ మేరకు సుప్రీంకోర్టును వివరణ కోరారు. రాజ్యాంగంలోని 200 అధికరణం కింద బిల్లులకు ఆమోదం తెలపడం, నిలిపి ఉంచడం, రాష్ట్రపతి పరిశీలనకు పంపే ప్రక్రియలో గవర్నర్లకు కొన్ని అధికారాలు ఉంటాయి. అదేసమయంలో ఈ ప్రక్రియకు గడువు కూడా ఏమీ లేదు. అలాగే 201 అధికరణం ప్రకారం రాష్ట్రపతికి కూడా అధికారాలు ఉంటాయి. ఆ అధికరణంలో కూడా గడువు విధించలేదు. ఈ నేపథ్యంలోనే బిల్లుల ఆమోదానికి గవర్నర్, రాష్ట్రపతికి సుప్రీంకోర్టు గడువు విధించడంపై ముర్ము 14 ప్రశ్నలు సంధించారు. ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరారు. ఈ అంశంపై స్పందించేందుకు సుప్రీంకోర్టు నూతన సీజేగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్ త్వరలోనే రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

**రాష్ట్రపతి సుప్రీంకోర్టును అడిగిన ప్రశ్నలివే..**

1. గవర్నర్ వద్దకు బిల్లులు వచ్చినప్పుడు ఆర్టికల్ 200 కింద ఆయనకు ఉండే రాజ్యాంగపరమైన అవకాశాలు ఏంటి?
2. ఆ అవకాశాల విషయంలో మంత్రివర్గం సలహాలకు గవర్నర్ కట్టుబడి ఉండాలా?
3. ఆర్టికల్ 200 కింద గవర్నర్ విచక్షణ మేరకు తీసుకునే నిర్ణయంపై న్యాయ సమీక్ష చేయొచ్చా?
4. ఆర్టికల్ 200 కింద గవర్నర్ తీసుకునే నిర్ణయాలపై న్యాయ పరిశీలన చేయకుండా ఆర్టికల్ 361 ప్రకారం పూర్తిగా నిషేధించవచ్చా?
5. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్లకు అధికారాలు ఉండగా.. రాజ్యాంగపరంగా ఎలాంటి గడువూ విధించకపోయినా.. బిల్లుల ఆమోద ప్రక్రియలో వారికి కోర్టులు గడువులు విధించవచ్చా? ఏ ప్రక్రియను అనుసరించాలనే విషయాన్ని సూచించవచ్చా?
6. ఆర్టికల్ 201 కింద రాష్ట్రపతి విచక్షణాధికారాలపై న్యాయ సమీక్ష చేయొచ్చా?
7. రాష్ట్రపతికి కోర్టులు గడువు విధించవచ్చా? ఆర్టికల్ 201 ప్రకారం విచక్షణాధికారాల వినియోగానికి సంబంధించిన ప్రక్రియను సూచించవచ్చా?
8. గవర్నర్ రిజర్వ్ చేసిన బిల్లులపై నిర్ణయం తీసుకునే విషయంలో రాష్ట్రపతి తప్పనిసరిగా ఆర్టికల్ 143 ప్రకారం సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని తీసుకోవాలా?
9. అధికారికంగా చట్టం అమల్లోకి రాకముందు.. ఆర్టికల్ 200, 201 కింద గవర్నర్, రాష్ట్రపతి తీసుకునే నిర్ణయాలు న్యాయబద్ధమేనా?
10. ఆర్టికల్ 142 ద్వారా రాష్ట్రపతి లేదా గవర్నర్‌కు సంక్రమించిన రాజ్యాంగపరమైన అధికారాలను మార్చడం లేదా నిరాకరించడం న్యాయ వ్యవస్థకు సాధ్యమా?
11. ఆర్టికల్ 200 కింద గవర్నర్ ఆమోదం లేకుండానే రాష్ట్రంలో చట్టం అమల్లోకి వస్తుందా?

## ఎమ్మెల్యే వీరేశం జన్మదినం సందర్భంగా జిల్లా స్థాయి క్రీడ పోటీలు



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మే 15

జన హృదయ నేత నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం జన్మదిన సందర్భంగా యువనాయకులు వేముల విపుల్ కుమార్ ఆధ్వర్యంలో నకిరేకల్ వేదికగా ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి వేములాస్ వాలిబాల్, కబడ్డీ మరియు క్రికెట్ టోర్నమెంట్ ఈ నెల 20వ తారీకు నుండి ప్రారంభించడం జరుగుతుంది అని రామన్నపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టే సంతోష్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక, శారీరక ఉల్లాసానికి దోహదడతాయని, ఈ నెల 18 వరకు క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకొని క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని, ఈ అవకాశాన్ని మండలంలో ఉన్న ప్రతి ఒక్క యువకుడు సద్వినియోగం చేసుకోవాలి అని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు పున్న అమరేందర్, ఎన్ ఎస్ యు ఐ మండలధ్యక్షులు మోటే క్రాంతి, పల్లపు రవి, నోముల ప్రవీణ్, గురుకు శివ, లావణం సాయి, అజార్, రిజ్వాన్, సింగరాజు యశ్వంత్, లవణం కృష్ణ, సుర్వి మచ్చగిరి, రంజిత్, సునీల్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## దశదినకర్మకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మే 15

రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్ రెడ్డి తండ్రి బండ గోపాల్ రెడ్డి మరణించగా గురువారం దశదిన కార్యక్రమమునకు మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య హాజరై గోపాల్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి పూలమాలలు వేయడం జరిగింది .కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లు బందెల రాములు, కంభంపాటి శ్రీనివాస్, మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు బొక్క మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీలు సాల్వేర్ అశోక్, పున్న వెంకటేశం, ఎండి ఆమీర్, జిల్లా నాయకులు బద్దుల రమేష్, అంతటి రమేష్, మాజీ ఉపసర్పంచ్ దాసిరెడ్డి శ్రవణ్ రెడ్డి, నాయకులు కోనూరు ముత్తయ్య, జాడ సంతోష్, కోళ్ల స్వామి, జెట్టి సైదులు, బొలుగుల కృష్ణ, ఎండి మోసబ్ ,గాదె శంకరయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీఐ రక్షక్ మహిళ శిశు రక్షణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంగా కళ్లెం ధర్మనీల

యాదాద్రి జిల్లా :రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మే 15



యాదాద్రి జిల్లా ఆర్టీఐ రక్షక్ మహిళ శిశు రక్షణ అధ్యక్షురాలుగా సేవలు అందిస్తున్న రామన్నపేట మండల కేంద్రానికి చెందిన కళ్లెం ధర్మనీలను తన సేవలను గుర్తించి ఆర్టీఐ రక్షక్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆర్టీఐ సతీష్ కళ్లెం ధర్మనీలను ఆర్టీఐ రక్షక్ మహిళ శిశు రక్షణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ గా నియమించడం జరిగింది. ధర్మనీల మాట్లాడుతూ మహిళల హక్కులు శిశు రక్షణ విషయంలో ఈ చట్టం ను ఉపయోగించి విద్య, ఆరోగ్యం వారికి పక్క అమలు జరిగేలా చూస్తూ అలాగే సమాచార హక్కు చట్టంను అమలుకు ప్రతి ఒక్కరికి అవగాహనా కల్పిస్తూ నావంతు బాధ్యతగా సంస్థ బలోపేతంకై కృషి చేస్తానని అన్నారు. నా నియామకానికి సహకరించిన ఆర్టీఐ రక్షక్ రాష్ట్ర కమిటీకి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## సిరిపురం గ్రామంలో మరణించిన గోవర్ధన్ కుంటుంబానికి సిపిఎం ఆర్థిక సహకారం



యాదాద్రి జిల్లా: రామన్నపేట: తోవ్వ ప్రతినిధి: మే 15

సిరిపురం గ్రామానికి చెందిన ఆటో యూనియన్ మాజీ అధ్యక్షుడు, మాజీ విద్యా కమిటీ ఛైర్మెన్ తుంగ గోవర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాగా వారి కుటుంబానికి సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో 33500/- రూ. ఆర్థిక సహకారం రైతు సంఘ జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి చేతుల మీదగా వారి కూతుళ్ళకు గురువారం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో అందరితో కలివిడిగా ఉంది సేవా గుణం కలిగిన గోవర్ధన్ మృతి వారి కుటుంబానికి తీరని లోతని అన్నారు.సిపిఎం కార్యకర్తల ఆర్థిక సహకారంతో కుటుంబానికి అందిచటం జరుగుతుందని. గోవర్ధన్ కుంటుంబానికి సిపిఎం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బల్గురి అంజయ్య, శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, రాపోలు ప్రభాకర్,నాయకులు అంబటి సురేందర్ రెడ్డి,భారత మృత్యుంజయ, కునూరు వెంకటేశం,దోమలపల్లి నర్సింహా, సిల్వేరు సత్తయ్య,గాదె కృష్ణ, ఏళ్ల సంతోష్ రెడ్డి,గుంజె సైదులు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ల రద్దు కోసం దేశవ్యాప్తంగా కార్మిక వర్గం సంఘటితమవ్వాలి

### సీఐటీయూ అధ్యక్షుడు చిన్నయ్య పడాల్

చింతపల్లి. తొవ్వ న్యూస్:



ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్తంగా సార్వత్రిక కార్మిక సమ్మెలో అన్ని వర్గాల కార్మికులు భాగస్వామ్యం కావాలని సీఐటీయూ అల్లూరి జిల్లా అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ పిలుపునిచ్చారు. చింతపల్లి మండలంలోని ఆచార్య ఎన్జీ రంగ యూనివర్శిటీ, ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న స్వీపర్లు, సెక్యూరిటీ సిబ్బంది, ఇతర కార్మికులకు సీఐటీయూ రాష్ట్ర కమిటీ ముద్రించిన లేబర్ కోడ్ల రద్దు పుస్తకాలు, సమ్మె కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం అనంతరం కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న హక్కులను నాలుగు నిమిషాలైనా చర్చించకుండా పార్లమెంట్‌లో ఆమోదింపజేయడం మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక ధోరణికి నిదర్శనమని ధ్వజమెత్తారు. నాలుగు లేబర్ కోడ్ల ద్వారా కార్మిక సంఘాల ఏర్పాటుపై, ఉద్యోగ భద్రత, కనీస జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలుపై హక్కులు తొలగించారని, 300 మందికి పైగా పనిచేస్తున్న పరిశ్రమల్లో ఉద్యోగులను నిర్దాక్షిణ్యంగా తొలగించే దారిని తీయడమని విమర్శించారు. కార్మికులను కట్టుబడి బానిసలుగా మార్చే ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక వర్గం సంఘటితమవుతున్నదన్నారు."ఎక్కడ పని చేసినా కార్మికుడైతే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని కార్మిక వ్యతిరేక విధానాలను ఎలుగెత్తి నిరసించండి" అంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె రహీం, అర్జున్, పర్వతమ్మ, సతీష్, రాము, ప్రభుత్వ ఆసుపత్రి పరిశుభ్ర కార్మికులు పాల్గొన్నారు.

## జనసేన చేరికలపై అసత్య ఆరోపణలు దౌర్జన్యం

### వైసీపీ నాయకులు, కార్యకర్తలు చిత్తశుద్ధితో పార్టీ పటిష్టతకు కట్టుబడి ఉన్నారు

### పంచాయతీ ప్రెసిడెంట్ గోపాల్



చింతపల్లి తొవ్వ న్యూస్:

వైకాపా పై జనసేన నేత వంపూరి గంగులయ్య చేసిన వ్యాఖ్యలు చింతపల్లి మండలంలో కలకలం సృష్టించాయి. జనసేన పార్టీ చేస్తున్న అసత్య ఆరోపణలను పెద్దబరడ పంచాయతీ ప్రెసిడెంట్ సామిడి గోపాల్ తీవ్రంగా ఖండించారు. పెద్దబరడ పంచాయతీ లోతుగెడ్డ జంక్షన్‌లో జరిగిన పత్రిక సమావేశంలో గోపాల్ మాట్లాడుతూ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తమ పార్టీ పటిష్టతకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని, ఇటువంటి దిగజారుడు ఆరోపణలు నిరాధారమని స్పష్టం చేశారు.కూడా రామకృష్ణ అనే వ్యక్తి తమ పార్టీ కార్యకర్త కాదని, అలాంటి వారిని వైకాపా కార్యకర్తలుగా చిత్రీకరించి, జనసేనలో చేరికల షోలు ప్రదర్శించడం ప్రజలను మోసం చేయడమేనని దుయ్యబట్టారు. చింతపల్లి మండలంలో వైకాపా బలంగా ఉందని, పార్టీ కార్యకర్తలు ప్రజల సమస్యలపై అపార నిబద్ధతతో పని చేస్తారని పేర్కొన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గిరిజన ప్రాంతాలకు అందించిన అభివృద్ధి ఫలితాలు తామెన్నడూ మరచిపోలేదని, బాక్సైట్ మైనింగ్ జీఓ 97 రద్దు, పోడు రైతులకు భూమి హక్కులు, గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత జగన్మోహన్ రెడ్డి దే అని గోపాల్ గుర్తు చేశారు. గిరిజన జాతిని మోసం చేసే డ్రామాలు ఆడే జనసేన నాయకులు ప్రజల్లో చెత్త ప్రచారం చేస్తూ తమ నాయకుల మెప్పు పొందడానికి అసత్య ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. మతి భ్రమించి దిగజారుడు రాజకీయాలకు తలవంచడం జనసేన నేతలకు ముద్రపడుతోందని గోపాల్ ఎద్దేవా చేశారు.

## పిసిరిమామిడి ఆయా పోస్టు కోసం విచారణ

### ఆయా పోస్టు వారసురాలుకి ఇవ్వాలని గ్రామస్తుల విన్నపం

చింతపల్లి తొవ్వ న్యూస్

మండలంలోని లోతుగడ్డ పంచాయితి చెరుకుంపాకలు గ్రామంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ ఆయా పోస్టు నియామకంలో అవకతవకలు జరిగాయని వంతల అప్పలమ్మ గ్రీవెన్స్ లో పిర్యాదు చేసిన సంగతి పాఠకులకు తెలిసిందే. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ కమిటీ అధికారిణి ఎ.లక్ష్మీదేవి ఆద్వర్యంలో ఆ కమిటీ సభ్యులు గురువారం పిసిరిమామిడి గ్రామంలో విచారణ చేపట్టారు. విచారణ సమయంలో పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూసాయి. పిసిరిమామిడి గ్రామంలో గతంలో ఆయాగా పనిచేసిన పాంగి కాంతమ్మ సర్వీస్ లో ఉండగానే మరణించటంతో ఆ పోస్టు వారసులకే వస్తుందనే గట్టి నమ్మకం గ్రామస్థులలో బలంగా నాటుకుపోయింది. దానితో మొన్న వెలువడిన నోటిఫికేషన్ సమయంలో ఆ పోస్టుకు గ్రామం నుండి ఎవరు అప్లికేషన్ పెట్టకూడదని గ్రామస్థులు నిర్ణయించుకున్నారు. దానితో మొదటిలో వంతల అప్పలమ్మ మినహా ఎవరు ఆ పోస్టుకు దరఖాస్తు చేయలేదు. చివరి సమయంలో గ్రామంలోని గెమ్మెలి కుమారి దరఖాస్తు చేసింది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ సమయంలో వంతల అప్పలమ్మ 10 వ తరగతి ఒరిజినల్ మార్కుల లిస్టు సుపించలేదని ఆమెకు రిజెక్ట్ లెటర్ అందించి, ఆ మరునాడు 10 గంటలలోగా ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాడేరు సబ్ కలెక్టర్ ఆఫీసులో హాజరు కావాలని సూచించారు ఐసిడియస్ అధికారులు. ఎట్టకేలకు చింతపల్లి ఐసిడియస్ సూపర్వైజర్ సహకారంతో పాడేరులో నిర్వహించిన ఇంటర్యూకు హాజరైంది అప్పలమ్మ ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత సాధించిన గెమ్మెలి కుమారికి పోస్టింగ్ ఇచ్చారు అధికారులు. గ్రామస్తుల సహకారం తనకు ఉన్నప్పటికీ అధికారుల అలసత్వం వలనే తనకు పోస్టు రాలేదని భావించిన అప్పలమ్మ గ్రీవెన్స్ లో పిర్యాదు చేసింది. అప్పలమ్మ పిర్యాదుతో విచారణ గురువారం పిసిరిమామిడి గ్రామంలో విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా గెమ్మెలి సన్యాసి రావు, గెమ్మెలి కామరాజు, పాంగి అప్పారావుతో పాటు మరో 18 మంది గ్రామస్థులు విచారణ కమిటీ సభ్యులకు తీర్మాన పత్రాన్ని అందించారు. గతంలో జరిగిన కౌన్సిలింగ్ లో అప్పలమ్మ జత చేసిన సర్టిపికెట్స్, గ్రామ పెద్దల తీర్మానం, ఆమె వారసత్వాన్ని పరిగణలోకి తీసుకొని ఆమెకు ఆయా పోస్టు ఇప్పించాలని కోరారు. లేని ఎడల ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని అన్నారు. తదుపరి చర్యల నిమిత్తం గ్రామస్థులు ఇచ్చిన తీర్మానాన్ని ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణ కమిటీ అధికారిణి ఎ.లక్ష్మీదేవి తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి ఐసిడియస్ సిడిపిఓ జి.వెంకట రమణి, సూపర్వైజర్లు పి.అప్పలనర్స, ఎస్కే గౌరీ ఉన్నీస, యుడిసి యం.శర్మ తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ నియామకాల విషయంలో ఏకగ్రీవ తీర్మానం ఏమిటని మరో వర్గం ప్రశ్నిస్తుంది.

## లోక శాంతి కోసం సింహాచలం వైపు పాదయాత్ర

### పాకలపాటి గురుదేవుల ఆశ్రమం నుంచి ప్రారంభం

చింతపల్లి తొవ్వ న్యూస్:



విశ్వశాంతి, లోకకల్యాణం, దేశ ప్రజల సుభిక్ష సమృద్ధుల కోసం పూజ్య రామానంద స్వామి ఆధ్వర్యంలో సింహాచలం లక్ష్మీ నృసింహస్వామి ఆలయం వరకు భక్తులు పాదయాత్ర ప్రారంభించారు. ఈ పాదయాత్ర చింతపల్లి మండలం లోతుగెడ్డ జంక్షన్ సమీపంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న పాకలపాటి గురుదేవుల ఆశ్రమం నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా పూజ్య స్వామి వారు మాట్లాడుతూ, దేశ ప్రజలలో శాంతి, ఐక్యత, ధార్మిక చైతన్యం పెంపొందించాలనే మహత్తర సంకల్పంతో ఈ పాదయాత్రను ప్రారంభించామని తెలిపారు. గతంలో కూడా 2015 నుండి ఇప్పటివరకు మూడుసార్లు ఇదే ఆశ్రమం నుంచి భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం వరకు భక్తులతో కలిసి పాదయాత్రలు విజయవంతంగా నిర్వహించామని, అంతేకాకుండా గత సంవత్సరం అయోధ్య రామమందిరానికి కేవలం 30 రోజులలో గురుభక్తులతో కలిసి పాదయాత్ర పూర్తిచేశామని ఆయన వివరించారు.ప్రస్తుతం సింహాచలం లక్ష్మీ నృసింహస్వామి దర్శనార్థం కొంతమంది శిష్యులతో కలిసి స్వామి వారు పాదయాత్ర చేస్తున్నారని, ఈ యాత్ర ద్వారా ప్రజల్లో భక్తి, నమ్మకం, సమాజంలో సాంఘిక, ధార్మిక విలువల పెంపొందనకు ఇది దోహదపడుతుందని భక్తులు తెలిపారు.ఈ పాదయాత్ర క్రమంలో గమ్యం దిశగా భక్తులు సంకల్పబద్ధంగా పాదయాత్ర కొనసాగిస్తున్నారు. గ్రామ గ్రామాల ద్వారా పయనించనున్న ఈ యాత్రకు స్థానిక ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున సహకారం అందిస్తున్నారు. పాదయాత్రలో భాగంగా ప్రతిచోటా హారతి, భజనలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో భక్తి భావన పెంపొందించడమే లక్ష్యమని స్వామి వారు పేర్కొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

### రీచ్ ల వద్ద జెసిబి లతో తహసిల్దార్ ట్రంచులు ఏర్పాటు

### ఇసుక అక్రమ రవాణా పై తొవ్వ కథనానికి స్పందన

తొవ్వ, నెల్లికుదురు, మే 15



మండలంలో పలు గ్రామాలను తాకుతూ ప్రవహిస్తున్న ఆ కేరు వాగు శివారు నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న తీరుపై తొవ్వ ప్రత్యేక కథనం ప్రచురించిన నేపథ్యంలో స్థానికతహసిల్దార్ కోడి చింతల రాజు స్పందించి ఉద్యోగులను అప్రమత్తం చేసి ఆయా రీచ్ ల వద్ద జెసిబి ల సహాయంతో వాహనాలు వెళ్లకుండా ట్రంచ్ లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రామన్నగూడెం, బ్రాహ్మణ కొత్తపల్లి, గ్రామాల వద్ద సిబ్బందితో గట్టి నిఘ ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి ఇసుక అక్రమ రవాణా చేస్తే పీడీ యాక్ట్ నమోదు చేయిస్తామని, హెచ్చరించారు. వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు శేఖర్, రాజు, అనిల్ తదితరులున్నారు.

## విద్యుత్ షాక్‌తో ఆవు మృతి



తొవ్వ, నెల్లికుదురు, మే 15

మండలంలోని నైనాల గ్రామానికి చెందిన ఆకుల లింగయ్య కు చెందిన ఆవు ప్రమాదవశాత్తు తన వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్ షాక్ కు గురై గురువారం ఉదయం మృతి చెందినట్లు రైతు లింగయ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం సపవట్ తండ సమీపంలో ఉన్నతన వ్యవసాయ క్షేత్రం వద్ద ఉదయం ఆవు మెత మేస్తుండగా ప్రమాదవశాత్తు 20 కె.వి ట్రాన్స్ఫార్మర్ కు తగిలి అక్కడికక్కడే మృతి చెందిందని బోరున విలపించారు.ఆవు విలువ 70వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వ ఆదుకోవాలని రైతు కోరారు.సంఘటన స్థలానికి విద్యుత్ ఏఎల్ఎం ముస్తఫా,పి డబ్ల్యూ సందీప్ చేరుకొని మృతికి గల కారణాలను తెలుసుకొని ఉన్నత అధికారులకు తెలియజేస్తామన్నారు.

## రాజీవ్ యువ వికాసంలో సిబిల్ స్కోర్ తీసేయాలి

### తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల

తొవ్వ,గార్ల మే 15



తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిం చడంలో భాగంగా ఏర్పాటు చేసిన రాజీవ్ యువ వికాస పథకంలో సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల డిమాండ్ చేశారు. గురువారం నాడు గార్ల మండల కేంద్రంలోని విశ్వ న్యాయవాద కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశ్వ మాట్లాడుతూ నిరుద్యోగ యువత యువకులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక అనేక విధాలుగా మానసిక క్షోభకు గురవుతున్న సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించి నిరుద్యోగ యువతీ యువకులకు 4 లక్షలలో సబ్సిడీపై రుణం ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. అదే సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి సిబిల్ స్కోర్ ప్రతిపాదికన రుణాలు మంజూరు చేయాలని ప్రకటించడం ఆస్యస్పదమన్నారు. సిబిల్ స్కోర్ నిబంధన పెట్టడం వల్ల 80 శాతంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నిరుద్యోగ యువతీ, యువకుల ఉపాధి అవకాశాలను దెబ్బతీసే విధంగా ముఖ్యమంత్రి ప్రకటించడం బాధాకరమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సివిల్ స్కోర్ ప్రతిపాదికన రుణాలు ఇవ్వాలని ప్రకటించడం, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సిబిల్ స్కోర్ లేదని ప్రకటించడం ప్రభుత్వ ద్వంద విధానాలకు అద్దం పడుతుందన్నారు.ముఖ్యమంత్రి ఒక తీరు, ఉప ముఖ్యమంత్రి మరో తీరు ప్రకటించడం పట్ల నిరుద్యోగ యువత యువకులు ఆందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీవ్ యువ వికాస పథకంలో అవినీతి అక్రమాలకు, రాజకీయ జోక్యానికి తావు లేకుండా పారదర్శకతతో వ్యవహరిస్తూ అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులకు రుణాలు మంజూరు చేయాలని విశ్వ డిమాండ్ చేశారు. ప్రభుత్వం దీనిపై స్పష్టమైన ప్రకటన చేస్తూ సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేసి నిరుద్యోగ యువతీ యువకులకు రుణాలు మంజూరు చేయాలని విశ్వ డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకులు గిన్నారపు మురళి తారక రామారావు, టిఆర్ఎస్ మండల నాయకులు ముంగి రాములు, అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఎ ఐ ఎస్ ఎఫ్ జిల్లా నాయకులు మాగం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



## పెళ్లి కాకుంటే ఆ హీరోతో డేటింగ్..

అందాల ముద్దుగుమ్మ అనసూయ న్యూస్ రీడర్‌గా కెరియర్ మొదలు పెట్టి, ఆ తర్వాత యాంకర్ గా మారింది. జబర్దస్త్‌తో ఫుల్ క్రేజ్ తెచ్చుకున్న తర్వాత సినిమాలలోకి అడుగుపెట్టింది. 2013లో మొదటి సారి తెరపై కనిపించిన అనసూయ దాదాపు 13 సంవత్సరాల తర్వాత 'సోగ్గాడే చిన్ని నాయనా' చిత్రంలో నాగార్జునతో కలిసి నటించి తెలుగు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. అందులో అనసూయ నటనకి మంచి మార్కులే పడ్డాయి. ఇక అదే సంవత్సరం అనసూయ చేసిన 'క్షణం' చిత్రం కూడా మంచి ఆదరణ పొందింది. ఇక నటిగా అనసూయ స్థాయిని పెంచిన చిత్రం రంగస్థలం కాగా, ఇందులో రంగమ్మత్త పాత్ర ఆమె కెరీర్‌లో మైల్ స్టోన్‌గా నిలిచింది. ప్రస్తుతం టీవీ షోలతోపాటు కొన్ని సినిమాల్లో కీలక పాత్రల్లో నటిస్తున్నారు అనసూయ భరద్వాజ్.అయితే అనసూయ తాజాగా ఓ బుల్లితెర కార్యక్రమంలో తన కెరీర్ గురించి మాట్లాడుతూ టాలీవుడ్ హీరోలపై సరదాగా కామెంట్స్ చేసింది. యాంకర్ రవి, శ్రీముఖి హోస్ట్ చేసిన టీవీ షోలో టాస్క్ ప్రకారం అడిగిన ప్రశ్నలన్నింటికి నిజాయితీగా సమాధానం చెప్పాలి. లేదంటే పచ్చి మిరపకాయ తినాల్సి వస్తుంది అని యాంకర్ రవి, శ్రీముఖి తెలిపారు. దీంతో అనసూయ ఛాలెంజ్ ని యాక్సెప్ట్ చేసింది. ఇక రవి ప్రశ్నిస్తూ మీకు ఒకవేళ పెళ్లి కాకుంటే టాలీవుడ్‌లో ఏ హీరోతో డేటింగ్ చేసేవారు అని అడగ్గా, దానికి ఏ మాత్రం ఆలోచించకుండా రామ్ చరణ్ అని సమాధానం చెప్పింది. అలానే అడవి శేష్ గురించి కూడా కామెంట్స్ చేస్తూ.. శేష్ షూటింగ్ లొకేషన్ లో మిలిటరీ ఆఫీసర్ లాగా స్ట్రిక్ట్ గా ఉంటారు. అడవి శేషు అలా ఉండడం వల్లే క్షణం కానీ, అతని ఇతర చిత్రాలు కానీ విజయం సాధిస్తున్నాయంటూ ప్రశంసలు కురిపించింది. ఇక ఇదే షోలో తన భర్త శశాంక్ భరద్వాజ్ గురించి మాట్లాడుతూ.. ఆయనలో ఉన్న ఒకే ఒక్క నెగిటివ్ క్వాలిటీ షార్ట్ టెంపర్ అని పేర్కొంది. మిగిలిన అన్ని విషయాల్లో తన భర్త మిస్టర్ పర్ఫెక్ట్ అంటూ ప్రశంసలు కురిపించింది. తన పేరు గురించి కూడా ప్రస్తావిస్తూ.. మొదట తన తల్లి తనకి పవిత్ర అనే పేరు పెట్టాలనుకుంది. అందుకే పవిత్ర అనే పేరు కూడా తనకిష్టమని అనసూయ తెలిపింది.

## ఊహించలేని కొత్త పాయింట్‌తో..




అశ్విన్‌బాబు హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. మామిడాల ఎం.ఆర్.కృష్ణ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని టి.గణపతి రెడ్డి నిర్మిస్తున్నారు. మెడికో థ్రిల్లర్ కథాంశమిది. గురువారం ఈ సినిమా టీజర్‌ను మ్యూజిక్ డైరెక్టర్ తమన్, దర్శకుడు శైలేష్ కొలను విడుదల చేశారు. 'ధర్మం దారి తప్పినప్పుడు, ఏ అవతారం రానప్పుడు, వచ్చినవాడు గౌతమ్..' అంటూ హీరో మనోజ్ మంచు వాయిస్ ఓవర్‌తో మొదలైన టీజర్ ఆసక్తికరంగా సాగింది. హీరో అశ్విన్‌బాబు పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించారు. ఈ సందర్భంగా అశ్విన్‌బాబు మాట్లాడుతూ.. ఎవరూ ఊహించలేని కొత్త పాయింట్‌తో ఈ చిత్రాన్ని తీశామని, ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసే అంశాలుంటాయని అన్నారు. రొటీన్ యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌కు భిన్నంగా ఉండే చిత్రమిదని దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాకు మంచి టీమ్ కుదిరిందని, సాంకేతికంగా ఉన్నతంగా ఉంటుందని నిర్మాత తెలిపారు. రియా సుమన్, అయేషాఖాన్, మురళీశర్మ, సచిన్‌ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎం.ఎన్.బాల్‌రెడ్డి, సంగీతం: గౌర హరి, నిర్మాణ సంస్థ: అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: మామిడాల ఎం.ఆర్.కృష్ణ.

## వర్జిన్ బాయ్స్ హంగామా



గీతానంద్, మిత్రాశర్మ జంటగా నటించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. దయానంద్ దర్శకుడు. రాజ్‌గురు ఫిల్మ్స్ పతాకంపై రాజా దరపునేని నిర్మించారు. ఇటీవల ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. 'నేటి జనరేషన్ రిలేషన్ షిప్స్‌ను ప్రజెంట్ చేసే చిత్రమిది. చక్కటి వినోదం, రొమాన్స్, ఎమోషన్స్‌తో ఆకట్టుకుంటుంది. యువతను మెప్పించే అన్ని అంశాలుంటాయి. పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అని మేకర్స్ తెలిపారు. ఆద్యంతం వినోదాత్మకంగా సాగే చిత్రమిదని, యూత్‌కు రిలేట్ అయ్యే అన్ని ఎలిమెంట్స్ ఉంటాయని నిర్మాత పేర్కొన్నారు. శ్రీహన్, రోనీత్, జెన్నీఫర్, అన్షుల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: స్మరణ్‌సాయి, దర్శకత్వం: దయానంద్.

## సందేశాత్మకంగా జనం




సుమన్, అజయ్‌ఘోష్, కిషోర్, వెంకటరమణ, ప్రగ్య నైనా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. స్వీయ దర్శకత్వంలో వెంకటరమణ పసుపులేటి రూపొందించారు. ఈ నెల 29న ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేయబోతున్నారు. గత ఏడాది నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రానికి మంచి ఆదరణ దక్కిందని మేకర్స్ తెలిపారు. దర్శకనిర్మాత వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ 'రాజకీయ వ్యవస్థలోని లోపాల్ని చర్చిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నేటి తరానికి చక్కటి సందేశాన్నందిస్తుంది. ఈ సినిమాలో సుమన్‌గారు పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ పాత్రలో నటించారు. సందేశంతో పాటు థ్రిల్లింగ్ అంశాలుంటాయి' అన్నారు.

## అంతా విచిత్రంగా చూస్తే, ఆమె మాత్రం..

సినిమారంగంలో రాణించాలనే కోరిక బలంగా ఉన్నా.. ఆ విషయంలో తల్లిదండ్రులు ప్రోత్సహం మాత్రం తెలుగమ్మాయిలకు అరుదే. కాస్టింగ్ కౌచ్ అనేది అన్ని రంగాల్లోనూ ఉంది. అయితే సినిమా రంగం అనేసరికి భూతద్దంలో చూడటం సమాజానికి పరిపాటైపోయింది. యాక్ట్రస్‌గా రాణించే విషయంలో తెలుగమ్మాయిలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కరువవ్వడానికి అదికూడా ఓ కారణం. ఈ విషయంలో తనది మాత్రం భిన్నమైన అనుభవమని అంటున్నది అచ్చతెలుగు అందం రీతూవర్మ. 'మా ఇంట్లో అందరూ ఇంజనీర్లూ, డాక్టర్లే. మా అమ్మ అయితే.. సొంతంగా స్కూల్ రన్ చేస్తున్నారు. నాకేమో చిన్నప్పట్నుంచీ యాక్టింగ్ అంటే ఇంట్రస్ట్. ఈ విషయం ఇంట్లో చెప్పినప్పుడు అంతా నన్ను విచిత్రంగా చూశారు. కానీ అమ్మ మాత్రం 'వెళ్లు.. ఓ ప్రయత్నం చేయ్' అంటూ ప్రోత్సహించారు. అమ్మకు నాపై ఉన్న నమ్మకం అలాంటిది. కెరీర్ తొలినాళ్లలో చిన్నచిన్న పాత్రలు చేస్తున్నప్పుడు కూడా అమ్మ నన్ను తప్పు పట్టలేదు. నిజంగా ఆమె సహకారం వల్లే ఈ రోజు హీరోయిన్ స్థాయికి చేరుకోగలిగా. అమ్మ నాపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ వస్తున్నా. ఇండస్ట్రీలో జరిగే ప్రతి విషయాన్నీ అమ్మతో పంచుకుంటా. సమస్యలెదురైతే వాటిని కూడా అమ్మతోనే షేర్ చేసుకుంటా. వాటికి వెంటనే అమ్మ పరిష్కారం చెప్పేస్తుంది. అమ్మ వృత్తి రీత్యా ఎంత బిజీగా ఉన్నా.. నాకు మాత్రం ఏ లోటూ రానివ్వదు.' అని చెప్పుకొచ్చింది అందాలభామ రీతూవర్మ.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో తొవ్వ దినపత్రిక లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన
జిల్లా బ్యూరో చీఫ్‌లు
జిల్లా స్టాఫ్ రిపోర్టర్‌లు
నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
మండల రిపోర్టర్‌లు
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు :
8328649322, 9398236146.

తొవ్వ
సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి
శుక్రవారం 16 మే 2025 పేజీలు 2

## గ్రామాల వారీగా సమావేశాలు

కరీంనగర్ రూరల్ పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రవాణాదారులపై పోలీసులు కొరడా ఝులిపిస్తున్నారు. కరీంనగర్ రూరల్ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, చొప్పదండి, గంగాధర, రామడుగు, తిమ్మాపూర్, మానకొండూర్, గన్నేరువరం, చిగురుమామిడి మండలాల పరిధిలో అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు రూరల్ ఏఎస్పీ శుభం ప్రకాశ్ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రూరల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల వారీగా గ్రామాల్లోని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, గ్రామస్థులు, బిల్డర్‌లతో నాలుగు రోజులుగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇక నుంచి అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. 10 సంవత్సరాలుగా పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఇసుక అక్రమ రవాణా కేసులు ఎదుర్కొంటున్న వారి జాబితాను తయారు చేసి ఆ కేసుల్లోని నిందితులను ముందస్తు చర్యగా స్థానిక తహసీల్దార్ల ఎదుట హాజరుపరుస్తున్నారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి మళ్లీ ఇసుక అక్రమ రవాణాచేస్తే లక్ష రూపాయల జరిమానా చెల్లించే విధంగా సొంత పూచీకత్తును విధిస్తున్నారు. కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి, దుర్శేడ్, వల్లంపహడ్, నగునూర్, బొమ్మకల్ గ్రామాలకు చెందిన 18 మంది ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లను బైండోవర్ చేశారు.



# ఇసుక అక్రమ రవాణాపై కొరడా

కరీంనగర్ క్రైం, మే 15: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నవారిపైన కేసులు నమోదు చేయటం సాధారణ ప్రక్రియ.. ఇక నుంచి అనుమతిలేని ఇసుకను కొనుగోలు చేసినవారిపై కూడా వ్యవస్థీకృత నేరం కింద చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న ఇసుక క్వారీల నుంచే ఇసుకను రవాణా చేయాలని, నిర్మాణదారులు, బిల్డర్ల అనుమతి ఉన్న క్వారీల ఇసుకనే కొనుగోలు చేయాలంటున్నారు. అనుమతిలేని ఇసుకగా తెలిసి, ప్రభుత్వ ఆదాయం కోల్పోయే విధంగా అక్రమార్కుల వద్ద కొనుగోలు చేస్తే కేసులను ఎదుర్కోవల్సిందేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## ఫైళ్ల ఆమోదానికి మంత్రులు

# డబ్బులు తీసుకుంటారు

**- అది సాధారణంగా జరిగే పనే - నాకు మాత్రం నయాపైసా వద్దు..**

**- కాలేజీకి భవనం కట్టాలని కోరా - మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు**

**గిర్మాజిపేట, మే 15:** తమ వద్దకు వచ్చే వివిధ కంపెనీల ఫైళ్లను క్లియర్ చేసేందుకు మంత్రులు మామూలుగా డబ్బులు తీసుకుంటారంటూ మంత్రి కొండా సురేఖ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వరంగల్‌లోని కృష్ణ కాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో రూ.5 కోట్ల సీఎసఆర్ నిధులతో అరబిందో ఫార్మా ఫౌండేషన్ నిర్మించిన నూతన భవనం శంకుస్థాపన కార్యక్రమంలో గురువారం ఆమె మాట్లాడారు. "ఎంతోమంది బాలికలకు ఉన్నత విద్య అందిస్తున్న కాలేజీ తరగతి గదులు వర్షాకాలంలో జలమయమవుతున్నాయి. విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. పాతది కూలగొట్టి, కొత్త భవనం కట్టాలని కలెక్టర్ కూడా నా దృష్టికి తెచ్చారు. ఇందుకు రూ.4.5 కోట్లు ఎక్కడి నుంచి తేవాలో దారీతెన్ను తెలియలేదు. మరి నేను అటవీ శాఖ మంత్రిగా ఉన్నాను కాబట్టి.. నా దగ్గరకు కొన్ని కంపెనీల ఫైళ్లు క్లియరెన్స్ కోసం వస్తాయి. మామూలుగా అలాంటి ఫైళ్లు వచ్చినప్పుడు మంత్రులు డబ్బులు తీసుకుని క్లియర్ చేస్తారు. అప్పుడు వాళ్లతో నేను అన్నా.. మాకు ఒక్క నయాపైసా ఇవ్వాల్సిన అవసరం లేదు. మీరు సమాజ సేవ చేయండి. మా స్కూల్ ఒకటి డెవలప్ చేయండి. మీ పేరు గుర్తుండి పోతుందని చెప్పా. అప్పుడు మా చేతుల్లో లేదు.. పై వాళ్లతో మాట్లాడతామని అరబిందో ఫార్మాకు చెందిన సదానంద రెడ్డి చెప్పారు. చివరకు సీఎసఆర్ నిధులు రూ.4.5 కోట్లతో కాలేజీ భవనం కడతామని చెప్పినప్పుడు నాకు సంతోషం కలిగింది" అని మంత్రి సురేఖ వ్యాఖ్యానించారు. ఆ నిధులతో గ్రౌండ్, రెండంతస్థులతో 15 తరగతి గదులు, ఆడిటోరియం తరహాలో పెద్ద హాల్, 60 అధునాతన టాయిలెట్లు, నూతన ఫర్నిచర్ విద్యార్థినులకు అందుబాటులోకి రానుందని తెలిపారు.



## ఆగస్టు 15 నాటికి ఖమ్మం-దేవరపల్లి హైవే సిద్ధం

**ఇప్పటికే 80 శాతం**

**పనులు పూర్తి : మంత్రి తుమ్మల**

**ఖమ్మం, మే15 :** వేంసూరు: ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనులు 80 శాతం పూర్తయ్యాయని, ఆగస్టు 15 నాటికి మిగిలిన పనులు పూర్తిచేసి వాహన రాకపోకలను ప్రారంభిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. నేషనల్ హైవే అథారిటీ, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖల అధికారులతో కలిసి ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను ఆయన గురువారం పరిశీలించారు. ఏపీలోని చింతలపుడి మండలం గుడిపట్లగూడెం గ్రామం నుంచి వైరా, కొణిజర్ల మీదుగా ధంసలాపురం వరకు 100 కిమీల మేర కారులో ప్రయాణిస్తూ పనులను పరిశీలించిన తర్వాత అధికారులకు పలు సూచనలు చేశారు. హైవే పరిశీలన తర్వాత తుమ్మల మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ, ఏపీలో మొత్తం 5 ప్యాకేజీల కింద ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయని, అందులో 3 ప్యాకేజీలు ఖమ్మం జిల్లాలో చేపట్టినట్లు తెలిపారు. రూ.2214 కోట్లతో మూడు ప్యాకేజీల కింద జరుగుతున్న పనులు 80 శాతం పూర్తయ్యాయని చెప్పారు.

## మత్స్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చొప్పదండి, మే 15 :



హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద గురువారం నిర్వహించిన మత్స్యకారుల మహా ధర్నాలో కరీంనగర్ జిల్లా మత్స్య కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సహజంగా మరణించిన మత్స్య కార్మికులకు 10 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి 5000 రూపాయలు పింఛన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పిట్టల వెంకటేష్, ఉపాధ్యక్షుడు నూనె శేఖర్, ప్రధాన కార్యదర్శి గణేష్, కార్యదర్శి పిట్టల సంపత్, పప్పు సదానందం తదితరులు పాల్గొన్నారు.

## మలేషియాలో చనిపోయిన మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్,మే15:



జగిత్యాల రూరల్ మండలం హబ్సిపూర్ గ్రామానికి చెందిన కారం నరసయ్య మలేషియాలో మరణించగా వారి కుటుంబ సభ్యులు గ్రామ నాయకులు విషయాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే మలేషియాలో ఉద్యోగం చేస్తున్న కల్లెద గ్రామానికి చెందిన ఘాజంగి రంజిత్ తో ఫోన్లో మాట్లాడి మృతదేహం ఇండియాకు తీసుకురావాల్సిన చర్యల గురించి మాట్లాడి తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీతో మాట్లాడుతానని అదేవిధంగా మలేషియాలో ఉన్న ఇండియన్ ఎంబసి అధికారులకు సమాచారం అందించి తీసుకురావడానికి అవసరమైన చర్యలు తీసుకుం టానని వారి కుటుంబ సభ్యులకు తెలిపిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. వెంట నాయకులు ముస్కు నారాయణరెడ్డి రాజేశ్వర్ రెడ్డి గడ్డం నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

**ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**



జగిత్యాల టౌన్, మే 15 :

జగిత్యాల పట్టణంలో గాంధీనగర్ ప్రైమరీ స్కూల్ లో అలాగే జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 8 లక్షల తో అభివృద్ధి పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం అడువాల జ్యోతి లక్ష్మణ్ మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ డిఈ నాగేశ్వర్ ఏఈ శరన్ నాయకులు బాలే శంకర్ ఆనంద్ రావు పంబాల రామ్ కుమార్ ముస్కు నారాయణ రెడ్డి డిష్ జగన్ చేట్పల్లి సుధాకర్ కోలగని సత్యం కూతురు రాజేష్ దుమాల రాజ్ కుమార్ బోడ్ల జగదీష్ విద్యార్థులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి, ఎంపిడిఓ కార్యాలయం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**





పెద్దపల్లి, మే-15:

ప్రభుత్వ ఆసుపత్రులలో జరిగే ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని , ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషెంట్ల సంఖ్య పెరగాలని అన్నారు. జనరల్ వార్డ్ ,ఓపి రూము, మాతా శిశు వార్డు తదితర విభాగాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాన్పుకు దగ్గరగా ఉన్న గర్భిణీ స్త్రీలను ఫాలో అప్ చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం జరిగేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లకు, రాజీవ్ యువ వికాసం పథకానికి లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి పారదర్శకంగా జరగాలని, లబ్ధిదారుల వివరాలను త్వరగా కలెక్టరేట్ కు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం సుల్తానాబాద్ పట్టణం లోని డంపింగ్ యార్డ్ ను కలెక్టర్ పరిశీలించారు. పట్టణ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో మరోచోట డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అనువైన స్థలం ఎంపిక చేయాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ కు సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, ఎంపిడిఓ దివ్య దర్శన్ రావు , సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ నియజ్ ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ఎలిగేడు తహసిల్దార్ కార్యాలయం సందర్శించి సదస్సుల నిర్వహణ పై రివ్యూ నిర్వహించిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి మే-15:

పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఎలిగేడు మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఎలిగేడు తహసిల్దార్ కార్యాలయం సందర్శించి సదస్సుల నిర్వహణ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా ఫీల్డ్ విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని అన్నారు. మనకు వచ్చిన దరఖాస్తులలో విచారణ పూర్తయిన వాటిని వెంటనే ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన ప్రతి దరఖాస్తుకు సంబంధిత నోటీసులు జారీ చేయాలని అన్నారు. భూ భారతి చట్ట ప్రకారం వాటి పరిష్కారానికి పకడ్బందీ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి. గంగయ్య, తాహసిల్దార్ యాకన్న, డిప్యూటీ తాసిల్దార్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావంతో నాణ్యమైన విద్యను అందించాలి

**రానున్న విద్యా సంవత్సరంలో మరిన్ని విభిన్న కార్యక్రమాలు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




కరీంనగర్ మే 15:

ప్రభుత్వ ఉపాధ్యాయులు అంకితభా వంతో పనిచేస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు విభిన్న అంశాలలో ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ టెక్నో స్కూల్లో నిర్వహిస్తున్నారు. మొదటి దఫాలో 500 మంది ఉపాధ్యాయులకు ఈనెల 13 నుండి 17 వరకు శిక్షణ కొనసాగుతోంది.గురువారం ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుల పైన బోధనాపరమైన బాధ్యతలే కాకుండా విద్యార్థుల సంరక్షణ బాధ్యతలు కూడా ఉన్నాయని అన్నారు. వృత్తి నిబద్ధత, అంకితభావంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన నైపుణ్య మెళకువలు నేర్చుకొని విద్యార్థులకు బోధించాలని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో ప్రభుత్వ విద్యార్థుల కోసం అనేక విభిన్న కార్యక్రమాలను అమలు చేస్తున్నామని, రానున్న విద్యా సంవత్సరంలోనూ ఈ కార్యక్రమాలు కొనసాగిస్తూ మరిన్ని కొత్త సేవలను ఆవిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యంగా ప్రతి పాఠశాలలో లైబ్రరీ ఉండేలా చూస్తామని వివరించారు.పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలవాలని అన్నారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, రక్షణ చర్యల గురించి క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తద్వారా విద్యార్థులకు చదువుతోపాటు సంరక్షణ చర్యలను కూడా తెలియజేయవచ్చని, నేరాలు జరగకుండా అరికట్టవచ్చని సూచించారు. నిత్యం విద్యార్థులను గమనిస్తూ చెడుదోవ పట్టకుండా కాపాడాలని, వారిని నిత్యం పలకరిస్తూ విద్యార్థుల్లో అకస్మాత్తుగా కలిగే మార్పులను గమనించాలని తెలిపారు. మాదకద్రవ్యాల బారిన పడకుండా వారిని కాపాడాలని, రోడ్డు భద్రత ట్రాఫిక్ పై అవగాహన పంటివి వారికి కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా ఫోక్సో, యాంటీ డ్రగ్, ట్రాఫిక్, డిజిటల్ అరెస్ట్ వంటి విషయాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, కోఆర్డినేటర్లు ఆంజనేయులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తొవ్వ

సామాన్యుని అవేదన అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

శుక్రవారం తేదీ 16-05-2025, **Thovva @epaper**




# ఘనంగా ప్రారంభమైన సరస్వతి పుష్కరాలు



కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలు ప్రారంభం

గురువారం వైభవంగా ప్రారంభమైన పుష్కరాలు

త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు

10 అడుగుల సరస్వతీదేవి విగ్రహాన్ని, 86 గదుల వసతి సముదాయాన్ని ప్రారంభించిన సీఎం



# స్నేహితుని కుటుంబానికి చేయూత

### ఆర్థిక సాయం అందచేస్తున్న శ్రీ అయ్యప్ప డ్రైవర్ అసోసియేషన్ మిత్రులు...





తొవ్వ ,మంచాల ,ఏప్రిల్ 19: ఆరుట్ల గ్రామంలో ఊహించని రీతిలో గుండెపోటుతో ఆకాల మరణం పొందిన చిరకాల స్నేహితుని ఆర్ల సత్తయ్య కుటుంబానికి అండగా మేము ఉన్నాము అంటూ ముందుకు వచ్చి ముప్పైవేలు (30000/-) రూపాయలు ఆర్థిక సహాయం అందించారు ఆటోడ్రైవర్ అసోసియేషన్ మిత్రులు. వివరాల్లోకి వెళితే మంచాల మండలం ఆరుట్ల గ్రామంలోని ఆర్ల సత్తయ్య ఇటీవలే కాలంలో ఆకాల మరణం చెందారు. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ మిత్రులఆ కుటుంబానికి చేయూత అందించారు. ఈ సందర్భంగా యూనియన్ మిత్రులు మాట్లాడుతూ ఈ లోకంలో స్నేహానికి మించిన బంధం మరొకటి లేదని అందరితో మమేకమై కలివిడిగా కష్టాలను పంచుకునే ఆప్తా మిత్రుడు దూరమావడం చాలా బాధాకరం అని భౌతికంగా మా మధ్య లేకపోయినా అతని భావాలు మాపై చూపించిన ఆధారాభిమానాలు ఏ నాటికీ చెరగని స్మృతులుగా మా మధ్యనే ఉంటాయని నెమరువేసుకున్నారు. మిత్రుడు సత్తయ్య కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

## ఆరుట్ల పాఠశాలను రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా తీర్చి దిద్దుదాం

### రాష్ట్ర విద్యా కమిషనర్ ఆకునూరి మురళి

తొవ్వ ,మంచాల ,మే 16:



ఆరుట్ల పాఠశాలను రాష్ట్రంలోనే రోల్ మోడల్ గా తీర్చి దిద్దుదామని రాష్ట్ర విద్యా కమిషనర్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు . బుధవారం సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వరరావు , చారకోన వెంకటేష్ , జ్యోత్స్న రెడ్డి రంగారెడ్డి జిల్లా డిఈఓ పి. సుసీంద్రరావు పాల్గొన్నారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుట్ల స్కూల్అభివృద్ధి పై ప్రత్యేక సూచనలు సలహాలు అందించారు . ఆరుట్లలో చుట్టుపక్క గ్రామాలలో విద్యార్థులు ఈ పాఠశాలలో వచ్చే విధంగా చూడాలన్నారు పాఠశాల 10 కోట్ల రూపాయలతో అభివృద్ధి జరుగుతున్న జడ్పీహెచ్ఎస్ మోడల్ స్కూల్ పరిసరాలు గ్రౌండ్ సందర్శించారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి (ఎంఈఓ) శ్రీ రాందాస్ ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల, హెచ్ ఎం . గిరిధర్ గౌడ్ ,టిజిఎంఎస్ ఆరుట్ల ప్రిన్సిపాల్శ్రీమతి సుప్రియ ఎస్డిఎఫ్ చైర్పర్సన్, రిటైర్డ్ ప్రొఫెసర్ శ్రీమతి. పద్మజ మాజీ సర్పంచ్ శ్రీ విష్ణువర్ధన్ రెడ్డి మాజీ ఎంపిటిసి శ్రీ శ్రీనివాస్ మాజీ ఉప సర్పంచ్ శ్రీ జంగయ్య గౌడ్ ఉపాధ్యాయులు శ్రీ పాపిరెడ్డి ఏఎస్డిఎమ్సి సభ్యులు, కె. భాస్కర్, జనిపాషా నుకం రాజు శ్రీశైలం లాలగారి జంగయ్య నుకం జంగయ్య,మల్లేష్ పార్వతి తదితరులు పాల్గొన్నారు

# శభాష్ కీర్తన


### ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని కీర్తనను అభినందించిన ఎ. డి లింగయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి సుశీంద్ర రావు లు




రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లా పూర్ మేట్ మండలం, పెద్ద అంబర్పేట్ లో జరుగుతున్న ఇన్ సర్వీస్ సోషల్ టీచర్స్ ఐదు రోజుల ట్రైనింగ్ లో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని కీర్తన ప్రపంచంలోని దాదాపు 200 దేశాల పేర్లు, వాటి రాజధానుల పేర్లు భారత దేశం రాష్ట్రాలు, రాజధానుల పేర్లు చాల వేగంగా, తక్కువ సమయం లో చెప్పి తన ప్రతిభను కనబర్చింది. టీచర్ ల శిక్షణ కార్యక్రమం అబ్జర్వేషన్ కోసం వచ్చిన తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ లింగయ్య సార్ గారు మరియు రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్ర రావు గార్లు చిన్నారి విద్యార్థి ని కీర్తన ప్రతిభ ను మెచ్చి కీర్తన ను, గైడ్ చేసిన సోషల్ సార్ రాము లను శాలువా తో సన్మానించి అభినందనలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో స్థానిక ఎంఈఓ జగదీశ్వర్ సార్, ,జివి మహిపాల్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, శ్రీశైలం, కిరణ్, పూజరి రమేశ జిల్లా సోషల్ టీచర్ లు పాల్గొన్నారు.

## రాజీవ్ యువ వికాసం పథకంకు సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తి వేయాలి

### బిఆర్ఎస్వి మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్



తొవ్వ ,మునుగోడు,మే 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు సిబిల్ స్కోర్ ఆధారంగానే ఎంపిక చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని బి ఆర్ఎస్వి మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు నలపరాజు రమేష్ తీవ్రంగా ఖండించారు.గురువారం తొవ్వ ప్రతినిధి తో మాట్లాడుతూ సిబిల్ స్కోర్ నిబంధన వెంటనే ఎత్తివేయాలని లేని యెడల యావత్ తెలంగాణ రాష్ట్ర యువత పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతాయి అని హెచ్చరించారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బి సి, మైనారిటీ ఇబీసీ లలో ఉన్న నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు 6000 కోట్ల రూపాయలతో 5లక్షల మందికి రుణాలు ఇవ్వాలని నిర్ణయం చేసి దరఖాస్తులు స్వీకరించింది. ప్రభుత్వ నిర్ణయతో 16 లక్షల మంది నిరుద్యోగ యువత, నిరుపేదలు, దళితులు గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులు స్వీకారణ పూర్తి అయిన తరువాత సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించడం లబ్ధిదారుల నోట్లో మట్టికోట్టడమే అవుతుంది అని విమర్శించారు. అంబేద్కర్ అభయహస్తం ఊసే లేదని, 1లక్ష నుండి 4లక్షల నిబంధనతో పేదల బతుకుల్లో ఇలాంటి మార్పు రాదని అన్నారు. కనీసం 10లక్షలు వరకు నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం అందిచలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధన ఎవ్వరి ప్రయోజనలకోసం. ప్రభుత్వం నిర్ణయం వలన అనేక మంది పేదలకు ఒక్కరికి కూడా రాజీవ్ యువ వికాసం రుణాలు వచ్చే అవకాశం లేదనీ అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సిబిల్ స్కోర్ నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ జేశారు.

శుక్రవారం

తొవ్వ

:16-05-2025

# కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్



తొవ్వ ,తోరూరు ,మే 15:

కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా ఉపాధ్యాయుల ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్ ప్రభుత్వాన్ని కోరారు గురువారం తొర్రూరు మండల కేంద్రంలోని లో జిల్లా కార్యదర్శి కొండం జనార్ధన్ అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఇప్పటికే చిన్నారెడ్డి కమిటీ గౌరవ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో క్యాబినెట్ సబ్ కమిటీ గౌరవ నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ అని చెప్పి కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. మేము బోనస్ లు గాని ఎలాంటి అదనపు భత్యాలు గాని అదనపు కోరికలు గాని కోరడం లేదని డిఏలు అనేవి పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా ప్రకటించాల్సి ఉంటుంది. మన రాష్ట్రంలో ఐదు డిఏలు పెండింగ్లో ఉన్నాయని ఇంకో 15 రోజులలో ఆరో డిఏ కూడా ఇవ్వాల్సి ఉంటుందని వెంటనే పెండింగ్ డిఏలు చెల్లించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అలాగే నిత్యవసర ధరలు ప్రజల జీవన వ్యయం ఆధారంగా ఐదు సంవత్సరాలకు ఒకసారి పేరివిజన్ కమిషన్ వేసి దానిని అమలు చేయాల్సి ఉండగా పేరివిజన్ కమిషన్ వేసి 21 నెలలు గడిచినప్పటికీ ఇంతవరకు స్పందన కరువైందన్నారు వెంటనే పెరివిజన్ రిపోర్ట్ తెప్పించుకొని అమలు చేయాలని కోరారు పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పులిచింత విష్ణువర్ధన్ రెడ్డి గారు మాట్లాడుతూ పాఠశాలల ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు ఉన్నత పాఠశాలలకు నోటు పుస్తకాలు ప్రాథమిక పాఠశాలలకు వర్క్ బుక్స్ అందజేయాలని కోరారు. జిల్లాలో మూతబడిన 144 పాఠశాలలను ఈ విద్యా సంవత్సరంలో తెరిపించాలని కోరారు జిల్లాలో ఇప్పటివరకు 411 పాఠశాలలకు ప్రహరీ గోడలు లేవని 130 పాఠశాలలలో మూత్రశాలలు లేవని వాటి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు ఈ విద్యా సంవత్సరం ప్రారంభం లోనే అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ సోమారపు ఐలయ్య జిల్లా కార్యదర్శి పెండ్లి రవీందర్ రెడ్డి పీజీహెచ్ఎం హేమాద్రి పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరం ఉపేందర్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి కొలుపుల శ్రీనివాస్ భోగ సంపత్ కుమారస్వామి జిల్లా కార్యవర్గ సభ్యురాలు సబియా బాను తదితరులు పాల్గొన్నారు.

# దేవరుప్పులలో భగ్గుమన్న కాంగ్రెస్ పార్టీ వర్గపోరు..





తొవ్వ ,ప్రతినిధి,మే 16:

జనగాం జిల్లా దేవరుప్పుల మండల కేంద్రములోని తిరుమల గార్డెన్స్ లో కాంగ్రెస్ పార్టీ సంస్థగత నిర్మాణ సన్నాహక సమావేశందేవరుప్పుల మండలనికి చెందిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షుడు సాయి ప్రకాష్, తోటకురి రమేష్ ని సన్నాహక సమావేశనికి రాకుండా అరెస్టు చేసిన పోలీసులు సమావేశానికి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలని బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషనుకు తరలించడం తో నన్ను ఎందుకు ఆపుతున్నారని పోలీసులతో వాగ్వాదానికి దిగిన దేవరుప్పుల మాజీ మండలపార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి అనుచరులు. దీనితో దేవురప్పల మండలంలో హస్తం పార్టీ కి వర్గపోవు తప్పడం లేదు




# స్థానిక సంస్థల ఎన్నికలో భారసా కు ఎదురులేదు

## బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి



తొవ్వ ,పాలకుర్తి ,మే 14:రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారసా కు ఎదురులేదని కారు జోరు లో కాంగ్రెస్ కొట్టుకుపోవడం ఖాయమని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు . బుధవారం పాలకుర్తి మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వర ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విస్తృతస్తాయి సమావేశంలో మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ శ్రేణులు సహాయసహకారాలు అందించి వరంగల్ ఎల్కతుర్తి లో జరిగిన భారీ బహిరంగ సభ విజయవంతంచేశారన్నారు అదే ఉత్సహంతో రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ క్యాడర్ సత్తా చాటాలని..ప్రతి ఒక్క ముఖ్య నాయకులకు , కార్యకర్తలకు యూత్ విభాగానికి వచ్చే స్థానిక ఎన్నికల్లో గెలిపే దిశగా కష్టపడాలని దిశా నిర్దేశం చేశారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య సీనియర్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు

**పదవ తరగతి ఫలితాల్లో జిల్లా ను మొదటి స్థానం నిలపడం అభినందనీయం**

## చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్.



మహబూబాబాద్, మే. 15

గతంలో మానుకోట జిల్లా 10వ తరగతి ఫలితాలలో రెండు పదుల పై స్థానంలో ఉండగా, ఈసారి ప్రస్తుత విద్యాశాఖ అధికారి డి. రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఒక టీం వర్క్ గా జిల్లాలో ఉన్న ఉపాధ్యాయ బృందం అంతా కలిసి జిల్లాని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపడం, ఇది సమైక్య కృషికి ఫలితం అని, కీలక పాత్ర పోషించిన విద్యాశాఖ అధికారి అభినందనీయులని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. పదిలో పదిలమైన స్థానాన్ని నిలపడం కోసం సర్వత్ర పనిచేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి ఆధ్యాత్మికవేత్త డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షులు వీరేందర్ గౌడ్, ఆరోగ్య మిత్ర ప్రతినిధి వెనగంటి శుభ తదితరులు పాల్గొన్నారు.

**భూ భారతి ఆర్ ఓ ఆర్ చట్టం లో వచ్చిన దరఖాస్తులు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి.**

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



తొవ్వ, దంతాలపల్లి, మే. 15

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టంలో భాగంగా దంతాలపల్లిని పైలెట్ మండలం గా ఎంపిక చేసి ఈనెల 5 నుండి 10వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. గురువారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు చేపట్టిన దరఖాస్తుల స్క్రుటినీ ని జిల్లా కలెక్టర్ రెవెన్యు అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారీ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. రెవిన్యూ రికార్డుల్లో వివరాలు సక్రమంగా పరిశీలించాలని, అనంతరం క్షేత్రస్థాయికి వెళ్లి నిబంధనలకు అనుగుణంగా విచారణ చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సునీల్ రెడ్డి, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంగమ్మ జాతర..



తొవ్వ, నరసింహుల పేట. మే. 15

మండల కేంద్రంలో కొలువుదీరిన గంగమ్మ జాతరను యాదవ కులస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ నెల 7న దిష్టి పోయడంతో మొదలైన గంగమ్మ పండుగ బుధవారం రోజున రాత్రి భేరి డప్పుల నడుమ అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామంలోని యాదవ కులస్తులు ఇంటి నుండి గంపలను పురవీధుల్లో డప్పువాయుద్యాల నడుమ జరిపారు. గజ్జల లాగులు ధరించి నృత్యాలు చేసుకుంటూ గంగమ్మ గుడికి చేరుకున్నారు. ఇట్టి కార్యక్రమానికి తహశీల్దార్ చప్పిడి నాగరాజు, ఎస్సై మాలోతు సురేష్, వెటర్నరీ డాక్టర్ సట్ల సౌమ్యచందర్ వివిధ మండలాల ఆ రైలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేఖ ఐల్లయ్య, ఎల్లావుల ఉప్పలయ్య, బారి రమేష్, బారి లింగన్న, మర్రి జంపయ్య, పున్నెపూర్తి ఐలయ్య, కాస యకయ్య,రేఖ అనిల్, తాడబోయిన వెంకన్న రేఖ ఉపేందర్. నరసయ్య. కొంపెల్లి నరేష్. తదితరులు పాల్గొన్నారు

## పాలకుర్తి అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి ...

**సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝాన్సి రాజేందర్ రెడ్డి**



తొవ్వ ,ప్రతినిధి ,మే 15:

పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఇంచార్జ్ ఝాన్సి రెడ్డి..లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు , గురువారం పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి అభివృద్ధి అంశాల జాబితా ని అందించారు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గారు సానుకూలంగా స్పందిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధుల జారీపై సానుకూల నిర్ణయం తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు..ప్రతిసారీ సమయం

దొరికినప్పుడల్లా ముఖ్యమంత్రిని మంత్రులను కలిసిఎమ్మెల్యే , నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు తీసుకురావడంలో చురుకుగా వ్యవహరిస్తున్నారన్నారు . ప్రజల అవసరాలను ప్రభుత్వానికి చేరవేసి, పాలకుర్తికి మెరుగైన మౌలిక సదుపాయాలు తీసుకురావడంలో వారి కృషి అభినందనీయం అని సీఎం రేవంత్ రెడ్డి గారు అభినందించారు..

శుక్రవారం తొవ్వ 13-05-2025

# ఘనంగా ప్రారంభమైన సరస్వతి పుష్కరాలు



తొవ్వ ,కాళేశ్వరం ప్రాంగణం .మే 15: తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలు గురువారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది కలిసే త్రివేణి సంగమం వద్ద ఈ పుష్కర వేడుకలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర



మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పుష్కరాల్లో పాల్గొన్నారు.గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తదితరులు పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం నదీమతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నూతనంగా ప్రతిష్టించిన 10 అడుగుల సరస్వతీదేవి విగ్రహాన్ని, భక్తుల సౌకర్యార్థం నిర్మించిన 86 గదుల నూతన వసతి



సముదాయాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, బృహస్పతి (గురువు) మిథున రాశిలోకి ప్రవేశించడంతో సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. బుధవారం రాత్రి 10.35 గంటలకు బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించి పుష్కర కాలం ఆరంభమైనప్పటికీ, కాళేశ్వరం ఆలయ అర్చకుల సూచన మేరకు గురువారం సూర్యోదయం నుంచి భక్తులు పుష్కర స్నానాలు ఆచరించడం మొదలుపెట్టారు. గురువారం వేకువజామున 5.44 గంటలకు శ్రీగురు మదనానంద సరస్వతి పీఠాధిపతి మాధవానంద సరస్వతి సరస్వతి ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పుష్కరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ పుష్కరాలు ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతాయి.పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ సాయంత్రం 6.45 గంటల నుంచి 7.35 గంటల వరకు సరస్వతి ఘాట్ వద్ద సరస్వతి నవరత్న మాల హారతి కార్యక్రమం నిర్వహిస్తారు. దీంతో పాటు వివిధ కళా,



సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేశారు. భక్తుల వసతి కోసం రుసుము చెల్లించి బస చేసేందుకు వీలుగా తాత్కాలిక టెంట్ సిటీని కూడా నిర్మించారు.పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో భక్తులకు తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, స్నానఘట్టాల నిర్మాణం, రహదారుల మరమ్మతులు, వాహనాల పార్కింగ్ వంటి విస్తృతమైన ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి కాళేశ్వరానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. పుష్కరాల సమయంలో ప్రతిరోజూ సగటున లక్షన్నర మంది భక్తులు వస్తారని



## సరస్వతి పుష్కర చిత్ర మాలిక





